క్లుప్తంగా

పాలమూర్ టీచర్‌కు ఓయూ డాక్టరేట్



శివలీల

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రానికి చెందిన ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు మండికాడి శివలీల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సోషియాలజీ విభాగంలో సోసియో సైకలాజికల్ స్టడీ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ ఎట్ ఉస్మానియా యూనివర్సిటీ అంశంలో పరిశోధ పూర్తి చేసినందుకు డాక్టరేట్‌ను అందుకున్నారు. ప్రస్తుతం ఈమె దేవరకద్ర మండలం హజిలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌జీటీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తమ పాఠశాలకు చెందిన టీచర్ డాక్టరేట్ సాధించినందుకు హెచ్‌ఎం జైపాల్‌రెడ్డి, శ్రీధర్, గీత, నరేందర్, టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్, ట్రెజరర్ కృష్ణమోహన్ అభినందనలు తెలిపారు. తనకు డాక్టరేట్ రావడానికి ప్రోత్సహించిన ప్రతిఒక్కరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.

ఢిల్లీ ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్



దేవరకద్ర: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నాలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితోపాటు నియోజకవర్గంలోని పలువురు నాయకులు పాల్గొన్నారు. ధర్నాలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కోనరాజశేఖర్, శెట్టి శేఖర్, శ్రీహరి, వడ్డేకృష్ణ, గోపాల్, నర్సింహ, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు దొర్లొద్దు



దేవరకద్ర: ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని నియోజకవర్గం ఎన్నికల అధికారి మధుసూదన్‌నాయక్ సూచించారు. బుధవారం ఆయన నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల తహసీల్దార్‌లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌లకు పలు సూచనలు చేశారు. ఫామ్ 6, 7, 8కు సంబంధించిన వాటిని సత్వరం పరిష్కరించాలని కోరారు. కొత్త ఓటరు పక్రియను కొనసాగించాలని, అలాగే ఓటర్ల పేర్లు, అడ్రస్‌లు, ఫొటోలు సవరించాలని వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని కోరారు.

కృత్రిమ ఇసుక తయారీపై కేసు నమోదు

నవాబుపేట: మండలంలోని కారూర్ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న విషయంలో రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. బుధవారం రెవెన్యూ అధికారి రామాంజనేయులు, మైనింగ్ అధికారులు, పోలీసులు గ్రామ శివారులో విచారణ జరిపారు. దీంతో అక్కడ వాగు పక్కలో కృత్రిమ ఇసుక తయారు చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారుల ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దాం



అడ్డాకుల: దేవరకద్ర నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మూసాపేట మండలం పోల్కంపల్లిలో బుధవారం యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. యూత్ కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడిగా మహేశ్, వైస్ ప్రెసిడెంట్‌గా ప్రతాప్‌రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా సాయికుమార్‌తోపాటు ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవికుమార్, అభిరామ్, ఆబేద్ తదితరులు ఉన్నారు.

జయశంకర్ సేవలు చిరస్మరణీయం

- కలెక్టర్ విజయేందిర బోయి
- తెలంగాణ సిద్ధాంతకర్తకు ఘననివాళి



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ రాష్ట్ర సాధనకు జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ విజయేందిరబోయి పేర్కొన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కలెక్టరేట్ ఉద్యోగులతోపాటు వివిధ శాఖల అధికారులు జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ సువర్ణరాజ్, డీపీఆర్‌ఓ శ్రీనివాస్, జిల్లా వెటర్నరి అధికారి మధుసుదన్‌గౌడ్, బీసీ సంక్షేమాధికారి ఇందిర, ఇస్రానాయక్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ పాల్గొన్నారు.

జయశంకర్ ఆశయాలకు తూట్లు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/ మెట్టుగడ్డ: తెలంగాణ సిద్ధాంతకర్త ఆశయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పా దుస్తుందని జయశంకర్ విశ్వకర్మ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య అన్నారు. జిల్లాకేంద్రంలోని తిమ్మసానిపల్లిలో సంఘం కార్యాలయంలో జయశంకర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ కారులను సన్మానించారు.

సార్ ఆశయాలు బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

జెడ్పీ సెంటర్(మహబూబ్‌నగర్): జయశంకర్ ఆశయాలు బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ముడా మాజీ చైర్మన్ వెంకన్న అన్నారు. బుధవారం జయశంకర్ విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు శివరాజు, నాయకులు పాల్గొన్నారు.

పీయూలో జయశంకర్‌కు నివాళి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి చిత్రపటానికి రిజిస్ట్రార్ రమేశ్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కుమారస్వామి, చంద్రకిరణ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో..

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు సాయిబాబా, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ఆశయాలను కొనసాగించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను తెలంగాణ సమాజం కొనసాగించాలని తెలంగాణ జాగృతి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటరామ్మూర్తి పేర్కొన్నారు. బుధవారం జయశంకర్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బీసీ సమాజ్ ఆధ్వర్యంలో..

మెట్టుగడ్డ: బీసీ సమాజ్ ఆధ్వర్యంలో కులసంఘాల నాయకులు జిల్లాకేంద్రంలోని గ్రీన్‌బెల్ట్ వద్ద జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షు డు శ్రీనివాస్‌సాగర్, లక్ష్మీకాంత్, శేఖరాచారి, మహేందర్, పురుషోత్తం, ఆశన్న నాయకులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్ మండలంలో..

మహమ్మదాబాద్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, డీటీ చంద్రశేఖర్, సిబ్బంది శ్రీనివాస్, రాకేశ్, ప్రశాంత్, శ్రీను రైతులు పాల్గొన్నారు.

గండేడ్ మండలంలో..

గండేడ్: మండలంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జయశంకర్ చిత్రపటాలకు పులమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఆర్‌ఐ యాసిన్, సిబ్బంది, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట మండలంలో..

నవాబుపేట: మండల కేంద్రంలోని పీఏసీఎస్, పంచాయతీ కార్యాలయం, విశ్వబ్రాహ్మణ మండల సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ నర్సింహులు, బీఆర్‌ఎస్ నాయకులు గోపాల్‌గౌడ్, కృష్ణయ్య, తాహేర్, నర్సింహులు, రాజు, హన్మంతు, పంచాయతీ కార్యదర్శి నరేశ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీసీ సమాజ్ నాయకులు



మహమ్మదాబాద్‌లో నివాళులర్పిస్తున్న తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి

రాజాపూర్ మండలంలో..

రాజాపూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాధాకృష్ణ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

భూత్పూర్ మండలంలో..

భూత్పూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కిషన్ జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ గీత, ఆర్‌ఐ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

మిడ్జిల్ మండలంలో..

మిడ్జిల్: ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ ఆనంద్, ఏఈ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారులను సన్మానిస్తున్న జయశంకర్ సేవాసమితి సభ్యులు



జిల్లా కేంద్రంలో జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్ననాయకులు

రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



పీహెచ్‌సీ డాక్టర్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి

దేవరకద్ర: ప్రభుత్వ వైద్యం కోసం వచ్చే రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని.. వారికి సరైన వైద్య సేవలు అందించాలని అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి సూచించారు. దేవరకద్రలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం సంత కావడంతో రోగుల సంఖ్య ఎక్కువగా కనిపించింది. ఆస్పత్రిలోని సౌకర్యాలను పరిశీలించారు. రోగుల గదిలోకి వెళ్లి వైద్యసేవలు ఎలా అందుతున్నాయని రోగులకు అడిగారు. అలాగే ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేసే ల్యాబ్‌ను పరిశీలించారు. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ని ఉపయోగించడంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శరత్‌చంద్రతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రోగుల ఓపీ రికార్డులు, మందుల రిజిష్టర్‌లను పరిశీలించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య పాల్గొన్నారు.

తల్లిపాలతోనే పుట్టిన బిడ్డకు ఆరోగ్యం



సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా

మహబూబ్‌నగర్ రూరల్: తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి జరీనాబేగం అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని టీడీగుట్ట సెక్టార్ పరిధిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డకు తల్లిపాలకు మించిన ఆహారం మరొకటిలేదన్నారు. ముర్రుపాలు బిడ్డ ఎదగడానికి ఎంతో దోహదపడుతుందని చెప్పారు. తల్లిపాలలో యాంటిబాడీలు, విటమిన్లు ప్రొటీన్లు ఉంటాయన్నారు. తల్లిపాలు బిడ్డ మానసిక వికాసానికి దోహదపడుతాయని అన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత కనీసం ఆరునెలలపాటు పాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ రాధిక, సూపర్‌వైజర్ జంగమ్మ, డాక్టర్ ప్రియాంక, మాజీ కౌన్సిలర్ మునీరొద్దీన్, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

షాసాబ్‌గుట్ట సెక్టార్‌లో..

తల్లిపాలు బిడ్డకు అమృతమని.. మంచి పోషకాహారం అందించినప్పుడే చిన్నారులు ఆరోగ్యంగా ఎదుగుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా అన్నారు. షాసాబ్‌గుట్ట సెక్టార్ పరిధిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని, పుట్టిన రెండుమూడు గంటల్లోపే తల్లిపాలు పట్టించాలన్నారు. బిడ్డకు పాలిచ్చే తల్లి కూడా పోషకాలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తల్లిపాలపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం శివశంకరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు అన్నపూర్ణ, ఆశ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి స్లాబ్‌కు పగుళ్లు!



పగుళ్లు వచ్చిన ఇంటి స్లాబ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

గండేడ్: ఇందిరమ్మ ఇంటిస్లాబ్ వేసిన మరుసటి రోజే పగుళ్లు వచ్చిన ఘటన మండలంలోని జంగంరెడ్డిపలిలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన కోస్గి కృష్ణమ్మకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించి నంచర్ల గేటు వద్ద ఓ దుకాణం నుంచి ఓ కంపెనీకి చెందిన బ్రాండెడ్ సిమెంట్ తెచ్చి ఆదివారం స్లాబ్ వేసింది. అయితే మరుసటిరోజే పగుళ్లు రావడంతోపాటు క్యూరింగ్ నీరు కింద బెడ్‌రూంలో కారడం మొదలైంది. ఈ విషయాన్ని సిమెంట్ తెచ్చిన దుకాణాదారు దృష్టికి తీసువెళ్లారు. అతను లబ్ధిదారు వాడిన సిమెంట్ కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇవ్వగా. మంగళవారం కంపెనీ టెక్నీషియన్లను వచ్చి వివిధ పరీక్షలు చేశారు. మిక్సింగ్‌లోనే తేడా రావడంతో సమస్య వచ్చినట్లు పేర్కొన్నారు. బుధవారం లబ్ధిదారులు ఈ విషయాన్ని ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి దృష్టికి తీసుకురావడంతో సంబంధిత గృహనిర్మాణ శాఖ ఏఈ రవితో కలిసి పగుళ్లు వచ్చిన స్లాబ్‌ను పరిశీలించారు. సిమెంట్ దుకాణం యజమాని, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. ఏఏ టెస్టులు చేశారు, ఫలితాలేంటో తమకు రిపోర్టులు పంపాలని కోరారు. ఇందిరమ్మ లబ్ధిదారుకు తగిన న్యాయం చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. వారివెంట పంచాయతీ కార్యదర్శి హైమావతి ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

మిడ్జిల్: రైతులకు డీఏపీ, యూరియా కావాల్సినంత అందుబాటులో ఉంచడం జరిగిందని, రైతులు దుర్వినియోగం చేసుకోకుండా అవసరమైన మేరకు వినియోగించుకోవాలని డీఏఓ వెంకటేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం డీఏఓ తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ షాప్‌లో యూరియా కృతిమ కొరత సృష్టించి బయట మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వంపై యూరియా కొరత ఉందని తప్పుడు ప్రచారం చేయడం సరికాదని జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. యూరియా కొరత లేకుండా క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారి పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట ఏఓ సిద్ధార్థ తదితరులు ఉన్నారు.

యూరియా కొరత లేదు..

భూత్పూర్: రైతులకు యూరియా కొరత లేదని, పట్టణంలోని వివిధ ఫర్టిలైజర్స్ దుకాణాల్లో యూరియా అందుబాటులో ఉందని ఏఓ మురళీధర్ అన్నారు. మండల రైతులకు 18వేల బస్తాల యూరియాకుగాను ఇప్పటి వరకు 12వేల బస్తాల యూరియాను సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. మరో 6వేల బస్తాల యూరియాను రోజువారీగా 500 బస్తాల యూరియాను ఫర్టిలైజర్స్ దుకాణాలతోపాటు సింగిల్ విండో, హాకా, మన గ్రోమోర్ దుకాణాల్లో సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ప్రత్యేకాధికారి



మిడ్జిల్ కేజీబీవీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్

మిడ్జిల్: మండల కేంద్రంలోని కేజీబీవీని బుధవారం మండల ప్రత్యేకాధికారి వెంకటేష్, ఎంపీడీఓ గీతాంజలితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రత్యేకాధికారి ఎదుట చికెన్ రావడంతో తూకం వేశారు. 23కిలోలకుగాను 19కిలోలు మాత్రమే ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూరగాయాలకు రసీద్ కూడా లేకపోవడంతో ఎంత తెప్పిస్తున్నారని అడిగారు. తూకం లేకుండా, రసీద్ లేకుండా వస్తే ఏమిటని ప్రశ్నించారు. గతంలో కూడా తప్పుడు లెక్కలు నమోదు చేయడంతో మండిపడ్డారు. ప్రతి విద్యార్థినికి వంద గ్రాముల చికెన్ పెట్టాలని, తక్కువ ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించగా.. అకౌంటెంట్ యాదమ్మ పొంతనలేని సమాధానం చెప్పారు. 20రోజుల నుంచి రికార్డులు నమోదు చేయకపోవడంతో వారి పనితీరు బాగలేదని కలెక్టర్‌కు రిపోర్టు చేశారు. ఇక్కడ పనిచేసే ప్రత్యేకాధికారిణి, అకౌంటెంట్ తప్పుడు లెక్కలు నమోదు చేసి విద్యార్థినుల పొట్టలు కొడుతున్నారని గుర్తించడం జరిగిందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆన్‌లైన్‌లో ఇక్కడి నుంచి రిపోర్టు పంపించడం జరిగిందని తెలిపారు. పూర్తి నివేదిక సిద్ధం చేసి ఇక్కడి వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు నివేదికలు పంపడం జరుగుతుందని తెలిపారు. ఇక్కడి సిబ్బంది క్షమించాలని వేడుకోగా, ఇప్పటికి మీకు మూడుసార్లు చెప్పిన, మీరు మారలేదని మీవల్ల నిరుపేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తు వెళ్లిపోయారు. అయిన వీరి పనితీరు మారడం లేదని వీరిని ఇక్కడి నుంచి తొలగించాలని కలెక్టర్‌ను కోరుతానని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కు చెందిన ఆశమ్మ మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని బుధవారం బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేశ్ పరామర్శించారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5వేలను బాధిత కుటుంబానికి అందజేసి కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మల్లేశ్, నాగరాజు, సుధాకర్, రవి, శ్రీను, బూరయ్య తదితరులు ఉన్నారు.

సిద్దోటం కార్యదర్శిపై విచారణ

నవాబుపేట: మండలంలోని సిద్దోటం కార్యదర్శి జనన ధ్రువపత్రానికి డబ్బులు తీసుకున్న విషయంలో బాధితుడు మండల అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో బుధవారం ఎంపీడీఓ జయరాంనాయక్ విచారణకు మండలస్థాయి అధికారిని నియమించినట్లు తెలిపారు. కాగా గ్రామంలో పంచాయతీ కార్యదర్శిపై అదే గ్రామానికి చెందిన కొందరు గ్రామస్తులు పలు ఆరోపణలు చేయడంతో వాటిపై విచారణ చేయాలని ఆదేశించినట్లు ప్రకటించారు.

నట్టల నివారణ చర్యలపై సమావేశం

నవాబుపేట: నట్టల మందు నివారణ కార్యక్రమాల నిర్వహణకు బుధవారం మండలంలోని అన్నిశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సుగల చిన్నారులు 9,531మంది ఉన్నట్లు గుర్తించామని ఆయన వివరించారు. దీనికిగానూ 11వ తేదీన జరిగే కార్యక్రమంలో నట్టల నివారణ మాత్రలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, నసీర్‌అహ్మద్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



జడ్చర్ల: పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన జడ్చర్ల మున్సిపాలిటీలో పర్యటించారు. ఆలూర రోడ్డు పక్కనున్న రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడ పారిశుద్ధ్యం లోపం లేకుండా చూడాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. హాస్టల్‌లో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా ఎప్పటకప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ మనుప్రియ తదితర సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక 24వ వార్డులో మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, వార్డు కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి తదితరులు పర్యటించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. నీటినిల్వ ప్రదేశాల్లో దోమలు పెరిగే అవకాశాలు ఉంటాయని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్– చించోళి జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భాగాంగా క్రిష్టియన్ పల్లి ఫీడర్‌పైన కొత్త స్తంభాలు ఏర్పాటు చేయడంలో భాగంగా గురువారం పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ రూరల్ ఏఈ నర్సిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంట వరకు క్రిష్టియన్‌పల్లి, అయోధ్యనగర్, ఉప్పరిగుడిసెలు, శ్రీరామకాలనీ, ఎంవీఎస్ డిగ్రీ కాలేజీ, ఫాతియా స్కూల్, మోటర్‌లైన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఆలయానికి వెండిచెంబు అందజేత

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం అయ్యప్పస్వామి (అయ్యప్పకొండ) ఆలయానికి కానుకగా పట్టణానికి చెందిన పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అశ్విని చంద్రశేఖర్ తనయుడు డాక్టర్ అశ్విని నవదీప్ వెండి చెంబును బుధవారం ఆలయ అర్చకుడు హన్మేశ్ గురుస్వామికి అందజేశారు. వెండి చెంబుతో అయ్యప్పస్వామికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తండ్రి, కుమారుడిని అర్చకులు ఆశీర్వదించారు.

జీపీ కార్మికులను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సుధాకర్

మహబూబ్ నగర్ న్యూటౌన్: జీపీలో మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ జీపీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా రెండో మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ హామీ మేరకు నెలనెలా వేతనాలు అందించాలని, కార్మికులకు పీఎఫ్ ఈఎస్‌ఐ, గ్రాట్యూటీ, పెన్షన్, ప్రమాద బీమా రూ.10లక్షలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి మాట్లాడుతూ.. జీపీలో ఒకరి స్థానంలో ఇద్దరుముగ్గురు మూడు, నాలుగువేలకు పనిచేస్తున్నారని, ఎవరి జీతం వారి ఖాతాల్లో వేసి, అందరినీ ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు కిల్లె గోపాల్, కురుమూర్తి, నారాయణ, వెంకటయ్య, చంద్రమ్మ, పాండు, కృష్ణయ్య ,రాజు, శ్రీశైలం, ప్రవీణ్, అంజమ్మ, బాలస్వామి, అచ్చులయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవాబుపేట: ప్రజాభద్రతలో పోలీసులకు ప్రజలంతా సహకరించాలని ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. బుధవారం మండలంలోని తీగలపల్లిలో ప్రజాభద్రత–పోలీసు బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నికల సమయంలో వర్గాలుగా విడిపోయి ఇతరులను ఇబ్బందులు పెట్టరాదని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే రౌడీషీట్లు నమోదవుతాయని, వాటితో తరతరాలకు చాలా ఇబ్బందులు తప్పవన్నారు. కార్యక్రమంలో మహిళా ఎస్‌ఐ సుజాత, కళాబృందం సభ్యులు రాములు, జగదీశ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణం.. ఆకుపచ్చ వలయం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని యువజన, క్రీడల శాఖ మెయిన్ స్టేడియానికి ఆకుపచ్చని శోభ ఉట్టిపడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో స్టేడియంలో ఎక్కడా చూసినా పచ్చని అందాలు దర్శనమిస్తున్నాయి. వాకింగ్ ట్రాక్ చుట్టూ ఏపుగా పెరిగిన ఆకుపచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.చెట్లతో క్రీడాశాఖ కార్యాలయం, బాస్కెట్‌బాల్ కోర్టు, హ్యాండ్‌బాల్ కోర్టు, చిల్డ్రన్స్ పార్క్‌తోపాటు ఇతర ప్రదేశాలు పచ్చని రంగేసినట్లు కనిపిస్తున్నాయి.



వాకింగ్ ట్రాకింగ్ చుట్టూ చెట్లు



ఆకుపచ్చగా కనిపిస్తున్న ప్రధాన మైదానం